# బాంధవ్యం

**కొం**డల మధ్యనుంచి రయ్‌న శరవేగంతో దూసుకుపోతోంది బస్సు. ప్రకృతి పచ్చచీర కట్టుకుని, అడవిపూలను అందంగా అలంకరించుకుని ఒయ్యారాలు పోతోంది.

శ్యామల క్రితం సారి వచ్చినప్పటిలా ఆ ప్రకృతి దృశ్యాలను ఆస్వాదించలేకపోతోంది. ఉండి ఉండి కళ్లల్లోకి ఊరుతున్న నీటిని కర్చీఫ్‌తో ఒత్తుకుంటోంది. భోరున వస్తున్న ఏడుపును ఎక్కిళ్లతో ఆపుకుంటోంది.

నెలరోజుల క్రితం ఇదే దారివెంట బస్సులో తీసుకెళ్లడం సాధ్యంకాక తండ్రిని టాక్సీలో తీసుకెళ్ళింది. వెళ్తున్నప్పుడు ఏదో ఆందోళనతో పరిసరాల్ని గమనించలేకపోయినా, తిరిగి వచ్చేటప్పుడు పెద్ద భారమేదో దించుకున్నట్టె ప్రకృతి పరిశీలనలో మునిగిపోయింది. ఆ అందానికి పులకించిపోయింది. ఇప్పుడేమో వెళ్లేటప్పుడు ఉన్న ప్రశాంతత వచ్చేటప్పుడు లేకుండాపోయింది.

తనని ఇంటికి తీసుకెళ్లిపొమ్మంటూ తండ్రి చూసిన బేలచూపు ఆమె గుండెని రంపంతో కోసింది. ఆ కోత కలిగించిన నొప్పి ఇంకా పచ్చిగానే వుంది.

వృద్ధాప్యంలో బాత్‌రూంలో జారిపడి తండ్రి తలకి దెబ్బ తగిలింది. అనారోగ్యం కూడా దానికి తోడైంది. చివరికి లేవలేని స్థితికి వచ్చిన తండ్రిని ఏకైక సంతానమైన తను గాక ఇంకెవరు చూస్తార్లే అని తన ఇంటికి తెచ్చుకుంది. తెచ్చుకున్న తరువాత తెలిసింది మంచంలో ఉన్న వ్యక్తిని సాకడం ఎంత కష్టమో!

ఆ దెబ్బ తగలరానిచోట ఎక్కడ తగిలిందో ఆయన్లో చాలా మార్పొచ్చింది. అక్కడికీ న్యూరాలజీ స్పెషలిస్టుకి చూపించి, ఆయన చెప్పిన టెస్టులన్నీ చేయించి, ఆయన రాసిన మందులన్నీ వాడింది. ఏమీ మార్పు కన్పించలేదు. కొన్ని నెలల తర్వాత డాక్టరుకీ విసుగొచ్చింది.

"పెద్ద వయసు కదా.... ఇక మందులు వాడటం ఆపేయండి" అన్నాడు ఆయన సందిగ్ధంగా.

ఓపక్క పిల్లల బాధ్యత, మరోపక్క భర్తా తనూ ఉద్యోగాలకి టైంకి పరుగులు తీయాల్సి రావడం. రాత్రి నిద్ర ఆలస్యమై ఉదయం ఆలస్యంగా లేద్దామంటే వీలుకాని పరిస్థితి.

తెల్లవార్లూ నిద్రపడుతుందో లేదో గాని అయిదు గంటలకే కాఫీ కాఫీ అని కలవరించి పోతాడాయన. నీళ్లందని కుండీలో మొక్కలాగా వేలాడిపోతాడు.

'వయసుడిగేకొద్దీ పసిపిల్లల్లాగే ఆకలికి ఆగలేరు' అంది తన కొలీగ్ జయ. నిజమే కావచ్చు. లేకపోతే ఎంతో బతిమలాడినా వేళకి నాలుగు మెతుకులు తినడం తప్ప చిరుతిళ్లేవీ తినని తన తండ్రికి ఇప్పుడీ విపరీతమైన ఆకలేమిటి? ఉదయం తిన్న టిఫిన్ మాట కాస్సేపటికే మరచిపోతున్నాడల్లే వుంది, అరగంటకాకముందే మళ్లీ టిఫిన్ కావాలని అడుగుతాడు. అలా అని అడిగిందల్లా పెట్టేస్తే జీర్ణం కావడంలేదు. గలీజైన బట్టల్ని ఉతకలేక ఎందరో పనివాళ్లు చెప్పకుండా మానేశారు.

ఒకప్పుడు ఆయనకి పెరుగన్నంతో అరటిపండు తినడం ఇష్టం. ఆ ఇష్టం ఇప్పుడు పరాకాష్ఠకి చేరుకుంది. ఇంట్లో అరటిపళ్ళు కన్పిస్తే చాలు, పిల్లల్ని అడిగి ఇప్పించుకుని తినేస్తున్నాడు. ఆ తర్వాత ముద్దలు ముద్దలుగా కఫం వాంతి చేసుకోవడం, కళ్లు తేలెయ్యడం. అప్పటి నుండి ఇంటికి అరటిపళ్లు తెచ్చుకోవాలంటే భయం పట్టుకుంది.

పనివాళ్లురానప్పుడు ఆయన్ని ఒక్కణ్ణే ఇంట్లో ఉంచి తాళంవేసి వెళ్లాల్సి వచ్చేది. అన్నీ దగ్గర్లో అమర్చి వెళ్లినా ఎందుకు లేచేడో రెండుమూడు సార్లు మంచానికి రెండడుగుల దూరంలో స్పృహలేకుండా పడివున్నాడు. అలాంటప్పుడు గుండె బేజారెత్తి పోయేది. ఒక్కోసారి కోపంతో ఆయన్ని చావచితక్కొట్టాలన్పించేది. ఏమీ చెయ్యలేని నిస్సహాయతతో ఏడుస్తూ కూర్చునేది.

ఆయన పురుషుడని ఎప్పుడో మరచిపోయింది. తనకొక పసిబిడ్డ అనుకుని కుడిచెయ్యి, ఎడమ చెయ్యి అనకుండా సేవలుచేసింది. నెలకి రెండు మూడు బెడ్‌షీట్లు చెత్తకుండీలో పడేయాల్సి రావడం, కొత్తవి కొనాల్సిరావడంతో శ్యామల భర్త రాజీవ విసుక్కునేవాడు. అవును, ఈయన అతని తండ్రి కాదుకదా! అతని తండ్రికి ఈ మాత్రమైనా అతను చేస్తాడని నమ్మకం లేదు.

గేటుబైట ఎప్పట్నుంచో ఉన్న మామిడిచెట్టును చూస్తే తన తండ్రిని చూసినట్టు అన్పిస్తోంది శ్యామలకి.

ఒకప్పుడు కొమ్మకొమ్మనా విరగకాసిన ఆ చెట్టు వయసుడిగిపోయి పుల్లవిరిగి పోయింది.

కాని, పక్షి తన పిల్లల్ని రెక్కలకింద దాచినట్టు కొమ్మల హస్తాల్ని చాచి దుమ్మూధూళి ఇంట్లోకి నేరుగా వచ్చిపడకుండా కాపాడుతోంది.

అవతలి వీధిలోని రైస్‌మిల్లు ధూళి, ఇవతలి వీధిలోని గ్రాఫైటు మిల్లు ధూళికి అడ్డుగా నిలబడుతోంది. ఇక, పక్షులకి ఆశ్రయం ఇవ్వడం సరేసరి.

శ్యామల తండ్రికి ఆ చెట్టంటే ఎంతో ఇష్టం.

పల్లెలో పుట్టి పెరిగినవాడు కావడం వలన ఆయనకి చెట్టూ చేమా, పచ్చని చేలూ ఇష్టం.

వచ్చినప్పుడల్లా 'అమ్మాయ్, ఈ చెట్టు వల్ల ఇంటికెంత అందంవచ్చిందో చూసేవా' అనేవాడు. వాకిలి నిండా రాలిపడే ఆకుల్ని చూసి పని మనిషి మాత్రం విసుక్కుంటోంది. 'ఈ దిక్కుమాలిన సాకిరీ నాను సెయ్యలేనమ్మా' అంటూ.

'ఈ రోజుల్లో ఎన్నో వృద్ధాశ్రమాలు ఉన్నాయి. ఇదేం పూర్వకాలమా చచ్చీచెడీ ఈ చాకిరీలన్నీ చెయ్యడానికి? ఇలాంటి వ్యక్తి ఇంట్లో ఉంటే పిల్లల ఆరోగ్యాలు, అంతెందుకు మన ఆరోగ్యాలు ఏమౌతాయో ఆలోచిస్తున్నావా? కన్న ఋణానికి ఓకే, ఆయన కోసం నువ్వెంతైనా ఖర్చు పెట్టు. అంతేగాని నీ ఆరోగ్యం పాడుచేసుకుని మమ్మల్ని ఇబ్బందుల పాలు చెయ్యకు" అన్నాడు రాజీవ.

ఓసారి ఆఫీసుకి వెళ్లబోతూండగా ముసలాయన పెద్ద వాంతి చేసుకున్నాడు. ఆ రోజుకిక లీవు పంపించి ఆయన ఒంటినీ, ఇంటినీ శుభ్రం చేసింది శ్యామల.

అంతాఅయ్యాక మళ్లీ వాంతి... మళ్లీ చాకిరీ... సాయం కాలానికి శ్యామల కళ్లు తిరిగి పడిపోయింది.

సాయంకాలం రాజీవ, పిల్లలు వచ్చి ఇద్దర్నీ హాస్పిటల్లో జాయిన్‌చేశారు. శ్యామలకి హై బి.పి. అని తేలింది. ఇక రాజీవ పట్టినపట్టు వదల్లేదు. శ్యామల చేత 'సరే' అనిపించాడు. టౌన్‌లో అన్ని వృద్ధాశ్రమాలున్నాయని అప్పటి వరకూ వాళ్లకి తెలీదు. కాని, ఎక్కడికి వెళ్ళినా సొంతంగా తమ పనులు తాము చేసుకునే ఓపికవున్న వాళ్లని తప్ప జాయిన్ చేసుకోము అన్నారు. ఎంత ఛార్జి ఇవ్వడానికి సిద్ధపడినా ఎవరూ ఒప్పుకోలేదు.

అలాంటి సందర్భంలో రాజీవ్ కొలీగ్ ఒకాయన ఈ హోమ్ గురించి చెప్పేడు. ఇది మత సంబంధమైన సేవాశ్రమం. ఎంతో కొంత ఇచ్చినా ఇవ్వకున్నా సేవాధర్మంగా వాళ్లు వృద్ధుల్ని చూస్తున్నారు. ఈ సంస్థ వెనుక ఉన్న ఛారిటబుల్ ట్రస్టు, వాళ్లకి ఆర్థిక సాయం అందిస్తోంది.

తామున్న టౌన్ నుంచి నాటయాభై కిలోమీటర్ల దూరంలో ఏజెన్సీ ప్రాంతంలో ఉంది హోమ్. తరచుగా వచ్చి చూడడానికి వీలుపడదు. రాజీవతో కలిసి ముందుగా వెళ్లి హోమ్‌నీ, అక్కడ పరిస్థితుల్నీ, పరిసరాల్నీ చూసి వచ్చింది శ్యామల. ఎంతో కొంత రాజీపడకపోతే తప్పదు అని నిశ్చయించుకుంది.

ఓ సెలవురోజు చూసుకుని టాక్సీలో తీసుకెళ్లి తండ్రినీ, ఆయన బట్టల్నీ, అవసర మయిన వస్తువుల్నీ హోమ్‌లో వదిలేసొచ్చింది. తను తిరిగొచ్చే వేళకి ముసలాయన మంచాన్ని తీసి పెరట్లో పడేసి, ఇల్లంతా ఫినాయిలు పోసి శుభ్రంగా కడిగించాడు రాజీవ. రెండు సంవత్సరాలుగా హాల్లో ఉంటున్న తండ్రి మంచం కనిపించక ఇంట్లో అడుగుపెడుతూనే గతుక్కుమంది శ్యామల.

ఓ వారం తర్వాత టేబుల్ సొరుగులో దేనికోసమో వెతుకుతుంటే తండ్రి తనకి చిన్నప్పుడు కొనిచ్చిన ఇంకు పెన్ను కన్పించింది. దాన్ని వాడకపోయినా చిన్నప్పటి జ్ఞాపకంగా పదిలంగా దాచుకుంది శ్యామల. తను అక్షరాలు నేర్చుకున్న కొత్తల్లో అడిగిందే తడవుగా తండ్రి తనని బజారుకి తీసుకెళ్లి కొనిపెట్టిన కలం అది.

ఇన్నాళ్లుగా దాన్ని పెద్దగా పట్టించుకోకపోయినా ఇప్పుడెందుకో దాన్ని చూస్తుంటే ఆనాటి తండ్రి మొహం కళ్ళ ముందుకొచ్చింది. ఒక్కసారిగా కళ్లల్లోకి నీళ్లు పొంగివచ్చాయి. 'మనుషులు మన కళ్ల ఎదుట ఉన్నంత కాలం వాళ్ల విలువ తెలిసిరాదు' అనుకుంది.

హోమ్‌లో వదిలేసి వస్తూ 'నాన్నా, ఇక మీద మీరిక్కడే ఉండాలి' అంటే అలాగేనని అమాయకంగా తలూపిన తండ్రి జాలి మొహం పదేపదే గుర్తుకొచ్చింది.

రోజూ నిద్రపోయే సమయంలో తన బాల్యం, తండ్రి చేసిన గారాబం, ఎక్కడికెళ్లినా తనని వెంట పెట్టుకుని తీసుకెళ్లడం అన్నీ గుర్తుకొచ్చేవి.

'లేక లేక ఆలస్యంగా పుట్టడం వల్ల పరంధామయ్యకి కూతురు తోడిదే లోకమయి పోయింది' అని చెవులు కొరుక్కునేవారు బంధుమిత్రులందరూ.

తల్లిపోయిన తరువాత తనదగ్గరికే వచ్చి ఉండమని అడిగింది శ్యామల. "ఎందుకమ్మా, పిల్లలతో అసలే మీకు ఇబ్బంది. అలవాటయిన ఊరు, అందరూ తెలిసినవాళ్లు, ఏదో ఇంత బియ్యం ఉడకేసుకు తింటే రోజు గడిచిపోతుంది నాకు" అన్నాడాయన.

ఎప్పుడయినా మనవల్ని చూడాలని కోరిక కలిగినప్పుడు వచ్చి ఒకరోజు ఉండి వెళ్లేవాడు.

జబ్బుపడ్డాక ఆయన శరీరం ఆయన స్వాధీనంలో లేకపోబట్టి తను తీసుకురాగలిగింది.

ఓ రోజు ఆఫీసు నుంచి వచ్చే సరికి ఇంటి ముందు మామిడిచెట్టు నరికిపడివుంది. డ్రైనేజి వెడల్పు చేయడానికి మున్సిపాల్టీవాళ్లు చెట్లు నరికేస్తున్నారట.

ముంగిట చెట్టులేని తమ ఇంటిని చూసి శ్యామల గుండె గొంతులో కొట్లాడినట్లైంది.

బోసిపోయిన వాకిలి నిరామయంగా వుంది. తాళం తీసి లోపలికి అడుగుపెట్టే సరికి ముందు గదుల నిండా తౌడు, గ్రాఫైటు పొడరు పల్చనిపొరమాదిరిగా గచ్చుమీద పరుచుకుని వున్నాయి. గాలిలో తెరకట్టి వున్నాయి.

ఓ గంట ఇంట్లో తిరిగే సరికి దగ్గు పట్టుకుంది. ఊపిరి సలపనట్లైంది. తాము కోల్పోయిందేమిటో అర్థమైంది. క్రమంగా రాత్రులు నిద్ర కరువైంది శ్యామలకి.

హఠాత్తుగా తండ్రి గుర్తుకొచ్చేడు. ఎవరూ వృద్ధాప్యం నుంచి తప్పించుకోలేరు కదా! ప్రస్తుత పర్యావరణ పరిస్థితుల్లో రోగాల బారినపడకుండా ఎవరికైనా మినహాయింపు వుందా? ఒక్కసారి వెళ్ళి తండ్రిని చూసి రావాలనే ఆకాంక్షని ఇక ఆపుకోవడం సాధ్యంకాలేదు.

నెలరోజుల్లోనే ఇంత దూరం మళ్లీ వచ్చింది.

"ఫోనైనా చెయ్యకుండా ఇలా హఠాత్తుగా వచ్చారేంటి" అంది అక్కడి కేర్ టేకర్. ఎంత దాచుకోవాలని ప్రయత్నించినా ఆవిడ ముఖంలో విసుగు దాగలేదు.

ఆ రోజు ఆదివారం కావడం వలన పనివాళ్లెవరూ రారట. ఒక ఆయా మాత్రం వుంది. మాసిపోయిన పంచె, చొక్కా, తైలసంస్కారం లేని జుట్టు - తండ్రినలా చూడగానే శ్యామల కళ్లునీటి చెలమలయ్యాయి.

శ్యామలను చూడగానే ఆయన కళ్లు మెరిశాయి. తనని ఇంటికి తీసుకెళ్లిపొమ్మని సైగ చేస్తూ బేలగా చూశాడు.

ఆయన బట్టల నుంచి సన్నగా దుర్గంధం వస్తోంది.

"ఇదేమిటి, మా నాన్నగారికి ఇవాళ స్నానం చేయించలేదా" ఆయాని అడిగింది శ్యామల.

"రోజు చేయించవమ్మా, సొంతంగా చేసుకోగలిగే వాళ్లు చేసుకుంటారు. ఇలాటోళ్లకి రెండు మూడు రోజుల కొకసారే" అని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పింది ఆయా.

మంచం పక్కనున్న స్టూలు జరుపుకొని కూర్చుంది శ్యామల. తండ్రి చేతిని తన చేతిలోకి తీసుకుంది.

ఆయన చెయ్యి సన్నగా కంపిస్తోంది.

గొప్ప ఊరడింపు లభించినట్టు కళ్లు మూసుకున్నాడు. ఆ మూసిన రెప్పల్లో నుంచి ధారాపాతంగా కన్నీరు చెవుల వెనక్కిజారుతోంది. సరిగా బ్రష్ చెయ్యని నోటి మీద రెండు ఈగలు ఝుమ్మని... శ్యామలకి కడుపులో దేవినట్టైంది. పళ్ల బిగువున ఓర్చుకుని కూర్చుంది.

పట్టుకెళ్లిన పళ్లు, బిస్కెట్లు, కేకులు లాంటివి ఆయాకిచ్చి రోజూ పెడుతూండమని చెప్పింది.

ఇక వెళ్లొస్తానని చెప్పినప్పుడు నిశ్చలంగా తండ్రి తన వేపు చూసిన చూపు... చుట్టూ మంచాలమీద పడుకుని ఉన్న వృద్ధుల ముఖాల్ని పరికించింది.

ప్రపంచంలోని నిర్లిప్తత అంతా ఆ ముఖాల్లో గూడుకట్టుకుంది. ఆ నిర్లిప్తమైన చూపుల్లోంచి సన్నని హేళన ఒకటి వెలువడి తనని చుట్టుముట్టినట్టైంది. ఆ చూపుల నుంచి తప్పించుకుని బయటకొచ్చి పడ్డింది.

కారిడార్లోంచి గబగబా నడిచివస్తూ ఉంటే పక్కనే వున్న లేడీస్ వింగ్‌లోంచి సన్నని గొంతుతో ప్రార్థన చేయడం వినిపించింది. శ్యామల కాళ్ళు ఆమెకి తెలియకుండానే అటువైపుకి నడిచాయి.

అందరూ ఒక మంచం చుట్టూ మూగి వున్నారు.

ఆ మంచం మీది వృద్ధురాలు అవసాన దశలో వుంది. అస్థిపంజరానికి చర్మం అంటించినట్టు ఉందా శరీరం. ఉండుండి ఎక్కిళ్లు వస్తున్నాయి. తెరచివున్న కళ్లు ఏ లోకాన్నో నిశ్చలంగా చూస్తున్నాయి.

తమ అందరి పరిస్థితీ ఎప్పుడో ఒకప్పుడు ఇంతేకదా అన్న భయం అక్కడున్న అందరి ముఖాల్లోనూ గూడుకట్టుకుంది. కేర్‌టేకర్ మతగ్రంథం తెరిచి ప్రార్థన చేస్తోంది. భరించరాని దుర్గంధం ఆ మంచం చుట్టూ వ్యాపించి వుంది. శ్యామల ఇక అక్కడ నిలబడలేక బైటికొచ్చేసింది. అంతులేని నీరసం ఆవహించిందామెని.

అక్కడున్న బెంచీమీద కూలబడింది. అటుగా వచ్చిన ఆయాని అడిగింది "అదేమిటీ, ఆవిడకి ప్రాణం పోతున్నట్టుంది, వాళ్ల వాళ్లకి తెలియజెయ్యకపోయారా"

"అయ్యో, ఏం చెప్తాంలెండి, రెణ్ణెల్ల కితం ఈపంతా బెడ్‌సోర్సులొచ్చి జెరంతో మూలుగుతున్న ఆయమ్మని అట్టుకొచ్చి ఇక్కడపడేసిపోయాడు కొడుకు.

మళ్లీ వొంగీ తొంగీ సూళ్లేదు. మూడు రోజుల్నుంచి ఆయమ్మకళ్లల్లో పేణాలుపెట్టుకుని కొడుకు కోసం ఎదురుచూసింది. ఆకర్కోటకంవోడు ఆకరిసూపులన్నా దక్కనిచ్చేడుకాడు. ఎన్నిసార్లు పోను జేసినా ఇదిగా వత్తన్నాను, అదిగో వత్తన్నాను అన్నాడు నిన్నటిదాకా.

ఇయాళ పోను చేస్తేనేమో అదేదోమీరే కానిచ్చెయ్యండి, నేను డబ్బులిచ్చేత్తాను అన్నాడంట.

ఆ ఎర్రిపేణానికి తెల్టంలేదు కొడుకు ఎసుమంటోడో. అతగాడి బిడ్డలకి ఏదన్నా రోగం వత్తే ఇలాగే వొదిలేసి పోతాడా? ముసల్తనంలో నా అన్నవోళ్లు దగ్గిర్లేపోతే ఆపేణాలెంత కొట్టుకులాడతాయో ఉప్పుడోళ్లికి తెల్టంలేదు.

"అందరూ ముసిలోళ్లయ్యేవోళ్లే కదా, ఆళ్లబిడ్డలు ఆళ్లనలాగ వొదిలేసిన్నాడు తెలుత్తాది ఆ బాదేటో".

ఛెళ్లున కొరడాతో కొట్టినట్లైంది శ్యామలకి.

లోపల్నుంచి సన్నని ఏడుపులు విన్పించాయి.

"అయిపోయింది. ఆ తల్లి జీవితం ముగిసిపోయింది. ఎక్కడ పుట్టిందో, ఎలా పెరిగిందో, ఆ కొడుకు కోసం ఎన్ని పాట్లు పడిందో తెలీదు. ఇప్పుడిలా అనామకురాలిగా, నా అన్నవాళ్లు దగ్గరలేకుండా చివరి శ్వాస విడిచింది.

ఒకవేళ ఆ కొడుక్కి ఆ తల్లిమీద ఏదైనా ద్వేషమేమో! అయితే మాత్రం, మనుషులూ ఉండరు, వాళ్ల దౌర్భాగ్యాలూ ఉండవు శాశ్వతంగా. కానీ, అనుబంధాల్లోని వైషమ్యం మాత్రం ఒకజీవి ఈలోకం నుంచి నిష్క్రమించే ముందు శాంతి లేకుండా చేస్తుంది.

అయినా, మంచి బిడ్డలుండకపోవచ్చు గాని మంచి తల్లి ఉండక పోవడం జరగదు.

"చెట్టూ చేమాలేని ఊళ్లలాంటివి వృద్ధులు లేని ఇళ్లు" పక్కనే కాషాయ వస్త్రాలు ధరించిన ఒక వృద్ధురాలు మరొకామెతో అంటోంది. సరిగ్గా ఈరోజే ఇక్కడికి ఎందుకొచ్చేనా అని మధనపడింది శ్యామల.

వికలమయిన మనసుతో బరువెక్కిన కాళ్లను ఈడ్చుకుంటూ వచ్చి బస్సెక్కింది.

"ఏంటమ్మా, ఏదన్నా బాధాకడుపులో?" అన్న పక్కనున్నావిడ పలకరింపుతో ఈ లోకంలోకొచ్చింది. ఆవిడ తన ముఖాన్నే చూస్తోంది.

శ్యామల కొంగుతో గబగబా కన్నీటితో తడిసిన చెంపలు తుడుచుకుంది. బస్సు కొండల్ని, వాగుల్ని అడవిని దాటుకుని హైవే మీదికి ఎప్పుడొచ్చిందో తెలీనేలేదు. ఎడతెరిపి లేకుండా లారీలు, బస్సులు దూసుకుపోతున్నాయి. రోడ్డు వెడల్పు చెయ్యడానికి హైవే పక్కన చెట్లన్నీ నరికేయడం వలన బోరోబయలుగా వుంది. ఎండకి బస్సు వేడెక్కి ప్రయాణీకుల్ని ఉడకబెడుతోంది.

శ్యామల మనసు మాత్రం వెనక్కి పరుగెడుతోంది.

ఇంటి ముందు చెట్టులేని తన ఇల్లూ, చెట్లులేని ఈ రోడ్డూ ఒక్కలాగే వున్నాయి. చెట్టులాంటి నాన్నని కూడా వదిలేసుకుంటే ఎలా? ఓ నిర్ణయానికి వచ్చిన శ్యామల హఠాత్తుగా లేచి నిల్చుంది. గొంతులో ఉద్వేగం పొంగుతుండగా కండక్టర్ని అడిగింది – "ఎక్స్క్యూజ్‌మీ, ఇక్కడెక్కడైనా టాక్సీ దొరుకుతుందా?" అని.

"ఆ...ఆ ముందు రాబోయే ఊళ్లో దొరుకుద్దమ్మా".

ఆ ఊరు ఎంత తొందరగా వస్తుందా అని ఎదురు చూస్తూ కూర్చుంది శ్యామల.

*స్వాతి సపరివార పత్రిక, 22.4.2005*